



"చాలా అవసరంలో ఉన్నానండీ. ఒక్క పాతిక రూపాయలు కావాలి" అన్నాడు వీర్రాజు.

వీర్రాజు నాకు తెలుసు అతను మాకు ఎదురింట్లో ఉన్నాడు. ఉన్నవాడిలాగే కనిపిస్తాడు. భార్యా, యిద్దరు పిల్లలూ అతనికి. పిల్లలిద్దరూ పదిహేనేళ్ళ ప్రాంతంవాళ్ళే.

మేము కొత్తగా ట్రాన్స్‌ఫర్ మీద ఇక్కడికి వచ్చాం. వచ్చి పదిహేను రోజులయింది. ఇంకా చుట్టుపక్కల వాళ్ళతో చెప్పుకోదగ్గ పరిచాయాలేమీ కాలేదు. వీర్రాజు మాత్రం ఎదురింటి అరుగుమీద కూర్చుని వచ్చినరోజునే పలకరించాడు. అప్పట్నించీ ప్రతిరోజూ కనబడ్డప్పుడల్లా ఆ ప్రశ్నా ఈ ప్రశ్నా వేస్తూనే ఉన్నాడు.

ఈ రోజు సాయంత్రమే మొదటి సారిగా తనంతట తనే అతను మా యింటికి వచ్చాడు. కానీ అప్పడుగుతాడని నే ననుకోలేదు అప్పులివ్వడమూ, పుచ్చుకోవడమూ కూడా నాకు నచ్చదు. కానీ అడిగినవాడు పెద్దమనిషి.

కాదంటే బాగుండదు. అడిగినది కూడా పెద్దమొత్తం కాదు.

మాట్లాడకుండా తీసి పాతికరూపాయలూ వీర్రాజు కిచ్చాను. "చాలా థ్యాంక్సండీ - మీ సహాయం మర్చిపోను" - అంటూ మరో పదినిముషాలు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు వీర్రాజు.

మర్నాడుదయం కాబోలు వీర్రాజు భార్య మా యింటికి వచ్చింది. మా ఆవిడ ఆమెను ఆప్యాయంగా పలకరించింది.

"వదినా - ఈ వీధి నీకు నచ్చిందా?" అనడిగింది వీర్రాజు భార్య ఆరంభంలోనే ఏకవచనానికి దిగిపోతూ.

ఆవిడ చనువుకూ, పలకరించిన తీరుకూ మా ఆవిడ చాలా మురిసిపోయింది. "నచ్చడాని కింకా ఎవరూ పరిచయం కాలేదమ్మా -" అంది

"వీధి సంగతెలాగున్నా ఈ వీధిలోకి మీరు రావడం నాకు బాగా నచ్చింది. మీ ముఖాలు చూస్తుంటేనే తెలిసిపోతోంది - మీరు చాలా చాలా స్నేహపాత్రులని. అయినా మనుషుల మంచితనాన్నంచనా వేయడానికి ముఖాలు చాలమ్మా - " అంది వీర్రాజు భార్య.

మా ఆవిడకు సంతోషంతో మాట రాలేదు.

"అన్నట్లు - సరుకులూ అవీ ఎక్కణ్ణించి తెచ్చుకుంటున్నారు ?"

"ఏ సరుకులూ ?......"

"పప్పు, ఉప్పు ...... కాఫీపొడి వగైరాలు..."

"సందు చివరున్న ముత్యాల్రావు దుకాణంలోంచి......"

"అక్కణ్ణించే తెచ్చుకుంటున్నారా - అయితే ఫరవాలేదులే - ఈ ప్రాంతాల్లో న్యాయమైన ధరలకు సరుకులు దొరికే షాపు ముత్యాల్రావు దొక్కటే. మీకు చెబుదామనుకున్నాను. నిన్నటికి నిన్న ఆయనొచ్చి ఈ విషయం చెబుదామనుకుంటూనే మరిచిపోయారుట. అదిసరే - మరి మీకు రేషన్ కార్డు వచ్చిందా ?"

"ఇంకా లేదమ్మా - పంచదారకు కాస్త ఇబ్బందిగానే ఉంది..."

"అయ్యో - నా కా దృష్టేలేదు. లేకపోతే మా కార్డుమీద మీకోసం ఒకటి రెండు కిలోలైనా అట్టేపెట్టి ఉండేదాన్ని......"

"బాగుంది. ఎవరి అవసరం వాళ్లది. మంచిమాటన్నారు చాలు. ఒకటిరెండు నెలలకు పంచదార బయటే కొనుక్కుంటాం. ఈలోగా కార్డు రానూ వస్తుంది -" అంది నా శ్రీమతి.

"అది కాదమ్మా - అసలు మాకు ఎప్పటి సరుకులు అప్పుడు తెచ్చుకోవడం తప్పితే ముందుగా తెచ్చి ఉంచుకునే అలవాటు లేదు. అయినా ఈ నెల

ఆయనకేం బుద్ధిపుట్టిందో పంచదార ముందుగానే తెచ్చేశారు. సగానికి పైగా అప్పుగానే వెళ్ళిపోయింది. ఇంతకీ మీ ఆయన కూడా మా ఆయనలాగేనా – లేక నెల సరుకులు ముందే ఇంట్లో తెచ్చిపడేస్తాడా ?"

"మా ఇంట్లో ఎప్పుడూ ఒక నెలకు సరిపడ సరుకులు అడ్వాన్సుగా ఉంటాయి –" అంది శ్రీమతి గర్వంగా.


"అమ్మయ్య చల్లటిమాట చెప్పావు. పొద్దున్నే బజారుకెళ్ళదలమంటే ఆయన వెళ్ళరు. పిల్లలు సరేసరి – చెప్పినమాట వినరు. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడు తెస్తానన్నారు. ఒక్క కప్పుడు కాఫీపొడుంటుందే ఇవ్వు తల్లీ" అంది వీర్రాజు భార్య.

ఉపోద్ఘాతమూ, సంభాషణా, ప్రశంసలూ – అన్నీ కలిపి ఇల్లా దారితీసేసరికి మా ఆవిడ నిర్ఘాంతపోయింది. ఆవిడ చాతుర్యానికి ముక్కుమీద వేలేసుకునే అడిగిన కాఫీపొడి ఇచ్చేసి ఆ తర్వాత జరిగినదంతా తూచా తప్పకుండా నాకు వివరించింది.

వినగానే వీర్రాజుభార్య చాతుర్యాన్ని అభినందించగలిగినా నా మనసు ప్రమాదాన్ని పసికట్టింది. ఏ పరిచయము లేకుండానే పలకరింపుల సాయంతో నాదగ్గర పాతికరూపాయలు తీసుకున్నాడు వీర్రాజు. మా ఆవిణ్ణి మాటల్లో పడగొట్టేసి కప్పుడు కాఫీపొడుం తీసుకుపోయింది వీర్రాజుభార్య. ఇంత కంటె ప్రమాదం ఆ రోజు జరిగింది.

మాకూ ఇద్దరే పిల్లలు ఇద్దరూ మగ వాళ్ళే. ఒకడికి పది, రెండోవాడికి ఎనిమిది. వీర్రాజు పిల్లలతో పోలిస్తే వీళ్ళిద్దరూ కాస్తపీలగాఉంటారు వీర్రాజు పెద్దకొడుక్కి పదిహేనేళ్ళు చిన్నవాడికి పధ్నాలుగు ఉండవచ్చు. ఎదురెదురు ఇళ్ళవాళ్ళు కావడంవల్ల – పిల్లలకు కూడా తొందరగానే దోస్తీ కలిగింది. మొదట్లో వీధిలో ఆడుకునేవారను కుంటాను. తర్వాత వీర్రాజింట్లో.ఆరోజు మాత్రం మొట్టమొదటిసారిగా వీర్రాజు పిల్లలు మా యింటికి వచ్చారు ఆడుకునేందుకు.

మా పిల్లలకు చాలా బొమ్మలు ఉన్నాయి. చిన్నతనంలో నేను బొమ్మలతో ఆడుకోలేదు. మా నాన్న కొనేవాడు కాదు. అందుకని నా కది తీరని కోరికగా ఉండిపోయింది. నేను ఎదిగి సంపాదన పరుడినై – నాకు పిల్లలు పుట్టేక కన పడిన బొమ్మనల్లా వాళ్ళకోసం కొంటం మొదలుపెట్టాను. ఆ బొమ్మలతో ముందు నేనూ మా ఆవిడ ఆడుకుని – తర్వాత పిల్లలకిస్తాం. అయితే పిల్లలను పూర్తిగా బొమ్మల దగ్గర వదిలిపెట్టం. మా ఎదురుగానే వాళ్ళు కాసేపు వాటితో జాగ్రత్తగా ఆడుకుని – తర్వాత దాచేయాలి. బొమ్మల విషయంలో అంత బుద్ధిగా



ఉండడం ఆ ఈడుపిల్లలకు తృప్తిగా ఉండదు. కానీ అవి చాలా ఖరీదైన బొమ్మలు కావడంవల్ల అలా చేసేవాళ్ళం మేము. కానీ ఈ మధ్య కాస్త పెద్ద వాళ్ళయ్యారు కాబట్టి అడపాతడపా మేము లేకపోయినా ఓ గంట ఆడుకో నిస్తున్నాం. ఆ కన్సెషన్ మా మూడ్‌ని బట్టి ఉంటుంది.

వీర్రాజు పిల్లలముందు కాస్త గొప్పగా ఉంటుందని తోచి మాఆవిడ పిల్లల కాడుకునేందుకు మంచి బొమ్మలే ఇచ్చి - జాగ్రత్త అని మరీ మరీ చెప్పింది. వాళ్ళు చాలాసేపు ఆడుకు న్నారు. వీర్రాజు పిల్లలు వెళ్ళిపోయాక చూస్తే మా ఆవిడకు వాటిలో ఒక బొమ్మ కనబడలేదు. అది బ్యాటరీ సహాయంతో నీటిలో నడిచే బోటు. చాలా వెతికిచూశారు. - కనబడలేదు. అప్పుడు పిల్లలు బిక్కముఖం వేశారు. మా ఆవిడ వచ్చి నాకు చెప్పింది.

ఇద్దరంకూడా చాలాసేపు తర్జనభర్జ నలు చేశాం కానీ ఏం జరిగిఉంటుందో తెలియలేదు. వీర్రాజుపిల్ల లా బొమ్మను తీసిఉండాలి. అంతకుమించి వేరే అవకాశ మేమీలేదు. కానీ అదే నిజమైతే మేము చేయగలిగినది కూడా ఏమీ లేదు.

"ఈ వీర్రాజుతో మనకాస్త ఇబ్బంది గానే ఉండేలా ఉంది..." అన్నాను.

**2**

సెలవులో ఉన్న రఘునాథ్ ఆ రోజే ఆఫీసులో చేరాడు. అక్కడ నన్ను చూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్విక్కడికొచ్చావా ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. అనుకోకుండా సడెన్‌గా ట్రాన్స్‌ఫరయింది. నీ కుత్తరం రాస్తే జవాబు రాలేదు. నాకో్కపం కూడా వచ్చింది. కానీ వచ్చేక తెలిసింది, నువ్వు ఊళ్ళో లేవని. క్షమించేశాను..."

"అయితే ఎక్కడ దిగావ్ ?"

అడ్రసు చెప్పాను. వింటూనే - "వ్హాట్ - ఆ వీర్రాజుకి ఎదురిల్లా - బాప్‌రే - వెంటనే ఇల్లు మార్చేసేయ్" అన్నాడు రఘునాథ్.

ఆశ్చర్యపోయాను. "వీర్రాజు నీకు తెలుసా ?"

"తెలియకపోవడమేం నాయనా - నేనూ వీర్రాజుకి ఎదురింట్లో కొంతకాలం ఉన్నాను. వాడి బాధలు భరించలేక అక్కణ్ణించి ఇల్లు మారిపోయాను..."

"ఏం చేస్తాడేమిటి - వాడు - " అన్నాను కుతూహలంగా.

"వాడొక బార్న్ క్రూక్. మనుషు ల్నేడిపించడమే వాడి వృత్తి. పెద్ద లిచ్చిపోయిన ఆస్తి ఉంది. అందమైన పెళ్ళాముంది. ఆరోగ్యంగాఉన్న పిల్ల లున్నారు. అన్నీఉన్నా వాడిది వెధవ బుద్ధి. వాడి పెళ్ళాం వాడికి స్వయానా మరదలు. బుద్ధిల్లో ఇద్దరివి ఒకటే పోలికలు. పిల్లలకూ్కడా తల్లిదండ్రుల బుద్ధులే వచ్చాయి - వస్తున్నాయి ..."

"దానికేముంది.అలాంటివాళ్ళెదురుగా ఉన్నారని నిక్షేపంలాంటి ఇల్లు వదులు కుంటామా ? దుష్టుడికి దూరంగా ఉంటే సరిపోతుంది..." అన్నాను.

"నువ్వుండాలనుకున్నా వాడుండ నివ్వడు. రాసుకుని పూసుకుని తిరుగు తాడు. వాడికి సిగ్గూఎగ్గూ లేవు ఉత్త రాస్కెల్. నా విషయంలో జరిగింది చెప్పమంటావా - రోజూ మా యింటి కొస్తుండేవాడు. ఆపీ ఇపీ కబుర్లు చెబుతూండేవాడు. కొత్తాపాతా, ఆడా మగా, చిన్నాపెద్దా అన్న భేదంలేకుండా అందరితో చనువుగా మాట్లాడేస్తాడు వాడు. ఒకసారి నేను లేనప్పుడు మా యింటికి వెళ్ళాడు. ఎదురింటి వాడు గదా అని మా ఆవిడ మర్యాద చేసి కాఫీకూడా ఇస్తే దాని చేయి పట్టు కున్నాట్ట ఈ రాస్కెల్. మా ఆవిడ కంగారుపడితే - తనకు మా అవిడ అంటే చాలా ఇష్టమనీ - దానికోసం ఏ త్యాగమైనా చేస్తాననీ - అంతగా అవ సరమనుకుంటే - నాకు తన పెళ్ళాన్ని ఒప్పగించడానికి కూడా సిద్ధమేననీ అన్నాట్ట. ముఖంతగలేసి బయటకు తోసేసిందట మా ఆవిడ. నిజం చెప్పా లంటే ఇదికూడా పెద్ద భయంకరమైన

అన్నాడు రఘునాథ్.

"మరి -" అన్నాను ఇంకా ఎంత భయంకర విశేషం వినాల్సొస్తుందో అన్న భయంతో.

ఆ తర్వాతకూడా వాడు ఎంత మాత్రం సిగ్గులేకుండా నిర్భయంగా మా ఇంటికి రాకపోకలు సాగించాడు. అలాంటివాడితో లాభంలేదని మేము ఇల్లు మార్చేశాం ఇంతకీ ఆ వీర్రాజు సంగతేమిటంటే వాడికి డబ్బు అవసరం లేకపోయినా అప్పుచేసి ఆ తర్వాత తనకి తెలియదు పొమ్మంటాడు. ఏంచేయాలో ఇచ్చినవాడస్థ పడుతూంటే అదిచూసి పిశాచానందిస్తూంటాడు. ఎన్ని మాటలన్నా పడడమేకాక నవ్వుతాడు. మా ఆవిడచేయి పట్టుకున్నది కూడా స్త్రీకాంక్షతో కాక - ఎదుటి మనిషిని కలవరపెట్టాలన్న దుర్బుద్ధితో. వాడిని చూసినప్పుడల్లా వాడు నా పెళ్ళాన్ని చేయిపట్టుకున్నాడన్న గుర్తు వస్తుంది. ఆ తర్వాత ఆ తర్వాత ఇంకేమీ జరగ లేదా - మా ఆవిడ చెప్పేదంతా నిజమేనా అని బెంగగా ఉంటుంది. వాడి క్కావలసిందదే. అదోరకం దరిద్రపు సైకాలజీ - "

"చూస్తాను వీర్రాజుని నేనూ ఓ చూపు చూస్తాను -" అన్నాను.

"వద్దు. మనబోటివాళ్ళ మన స్తత్వా నికి వాడితో ఏదీ సరిపడదు. దుష్టుడికి గురించి ఇల్లు మార్చేయ్..."

"మారుస్తాను కానీ ఈ లోగా నేను రాబట్టుకోవలసినవి కొన్ని ఉన్నాయి. రాబట్టుకోనీ..." అన్నాను.

రఘునాథ్ నావంక ఆశ్చర్యంగా చూశాడు.

## 3

"నాకో యాభై రూపాయలు కావా లండీ" అన్నాడు వీర్రాజు.

"మీ సంగతటుంచండి. మీకు అప్పు చేసే అలవాటుంది. నాకా అలవాటులేదు. అర్జంటుగా పాతికరూపాయలు కావాలి, ఎలా సంపాదించాలా అని చూస్తు న్నాను..." అన్నాను.

"అదేటండోయ్ - నాకు అప్పుచేసే అలవాటుందంటున్నారు. డబ్బుకోసం ఎవర్నయినా అడగడం జీవితంలో ఇదే మొదటిసారి నాకు ... " అన్నాడు ఆశ్చర్యాన్నభినయిస్తూ.

"మరి క్రితం నెలలో నా దగ్గర తీసుకున్న పాతిక సంగతి..."

"చూడండి మూర్తిగారూ! ఇవి పెద్ద మనుషుల లక్షణం కాదు. మీకు పాతిక రూపాయ లవసరంపడ్డాయిగదా అని అవి నేను మీకు బాకీఉన్నానని అబద్ధ మాడడం తగదు. కావాలంటే నన్ను అడగండి. ఇచ్చేవాణ్ణి చూపిస్తాను. అంతేకానీ నేను మీ దగ్గర క్రితంనెలలో

వీర్రాజు.

నోట మాటరాలేదు నాకు. రఘునాథ్ చెప్పినప్పటికీ - వీర్రాజు మరీ ఇంత పచ్చిగా ప్రవర్తిస్తా డనుకోలేదు. "మీరు చాలా పెద్దమనుషు లనుకున్నాను -" అన్నాను బాధపడుతున్నట్టు.

"నే నెప్పుడూ పెద్దమనిషినే. అవసరాలు మనిషిచేత అబద్ధమాడిస్తాయి వస్తాను ......" అని వెళ్ళిపోయాడు వీర్రాజు.

ఇలాంటి సంఘటనే మా ఆవిడ విషయంలోనూ జరిగిందట. వీర్రాజు భార్య కందిపప్పు అప్పుకావాలని అడగడాని కొచ్చిందట. అప్పుడు మా ఆవిడ కాఫీపొడి బాకీ గురించి గుర్తుచేసిందట.

"బాగుందమ్మా - కందిపప్పుకి వచ్చానుగదా అని కాఫీపొడి కూడా తీసుకెళ్ళానంటున్నావు. ఎవరికిచ్చి ఎవరినడుగుతున్నావో-ఇంట్లో కాఫీపొడి లేకపోతే కాఫీతాగడమైనా మానేస్తాగానీ అప్పుకెళ్ళను. కందిపప్పంటే ఆ సంగతి వేరు. పప్పులేకపోతే మావారికి ముద్దదిగదు..."అందిట వీర్రాజు భార్య.

మర్నాడు సాయంత్రం వీర్రాజు మమ్మల్ని వాళ్ళింటికి ఆహ్వానించాడు. నిన్నటి సంగతంతా మరిచిపోయినట్లే ఉన్నాడు. చాలా మామూలుగా మాట్లాడుతున్నాడు. మాకోసం ఉప్మా అదీ బాగానే వుంది.

మేము కబుర్లాడుతూండగా వీర్రాజు పిల్లలు వచ్చారు. మావయ్యగారికి మా బొమ్మలు చూపిస్తామంటూ మారాం మొదలుపెట్టారు. సరేనని చూడ్డానికి వెళ్ళాం.

వీర్రాజుపిల్లలకు కూడా చాలా బొమ్మలున్నాయి. వాటిలో చాలావరకూ ఖరీదైనవే అలా అవీ ఇవీ చూస్తుండగా వాటిలో బోటు కనబడింది. అప్రయత్నంగా నా చేయి దానిమీద పడింది. అందుకున్నాను.

"అది బ్యాటరీతో నడిచే బోటు. సీటిలో వదిలామంటే గొప్ప స్పీడుగా పోతుంది. అయితే ఇంట్లో ఉండే టబ్బు లాభంలేదు. బయట యే చెరువుల్లోనైనా ఆడుకోవాల్సిందే" - అన్నా వీర్రాజు కొడుకు.

నే నా బోటుతీసుకుని పరిశీలించి చూశాను. పై భాగంలో ఒక మూల సన్నగా పగులు కనిపించింది. సందేహం లేదు - అది మా బోటే......

"మా అబ్బాయి పుట్టినరోజుకి రెండు సంవత్సరాల క్రితం నా స్నేహితుడొకడు దీన్ని బహుమతిగా ఇచ్చాడు..." అన్నాడు వీర్రాజు. ఇంక నాకక్కడ ఉండబుద్ధి కాలేదు.

"అది నా బోటేనే అమ్మా –" అన్నాడు నా రెండో కొడుకు.

బోటు - వాళ్ళకి ఒకటుంది - " అంది శ్రీమతి.

"మీకు ఇలాంటి బోటుండేదా ?-" అన్నాడు వీర్రాజు.

"ఉ ం డే ద ం డీ. నెల్లాళ్ళక్రితం పోయింది..."

"పిల్లల ఆటవస్తువుల విషయంలో జాగ్రత్త ఉండాలండీ - మా పిల్లలకైతే మేము వేరే ఏమీ చెప్పక్కరలేదు. వాళ్ళకు చాలా జాగ్రత్త ఎక్కువ" అన్నాడు వీర్రాజు.

నాకు ఒళ్ళుమండిపోయింది కానీ తమాయించుకున్నాను. అప్పుడే నేను వీర్రాజు ముఖంలోకి పరిశీలనగా చూశాను. అంతులేని ఆనందంతో అతనిముఖం వెలిగిపోతోంది రఘునాథ్ చెప్పింది నిజమే - ఎదుటివాళ్ళని ఇరుకునబెట్టి ఆనందించే మన స్తత్వం వీర్రాజుది. నా ఇబ్బంది తను కనిపెట్టి ఆనందిస్తున్నట్లున్నాడు.

ఆ తర్వాత నాకు వాళ్ళింట్లో ముళ్ళ మీద కూర్చున్నట్లుంది. వీలయినంత త్వరగా బయటపడ్డాం. "మేము ప్రత్యేకించి పిలపక్కరలేదు. వీలున్నప్పుడల్లా వస్తూండండి. మీరు పిలవకపోయినా మేమూ అలాగే వస్తూంటాం..." అన్నాడు వీర్రాజు. అలాగేనని తలూపి ఇంట్లోపడ్డాను.

"ఎంత ధైర్యమండీ - నిలువునా ఎవ్వాలంపున్నాయి ముఖములు. వళ్ళ నేమనుకోవాలో తెలియడంలేదు. ఆ బోటు విషయం మీరు గమనించారో లేదో! కానీ - అది మనదే......"

"అవును. దానికి పగులు కూడా ఉంది. కానీ మనదేనని ఎలా చెబుతాం" అన్నాను. అన్నాక ఒక క్షణం ఆలోచించి - "చాలాకాలంగా నీకో విషయం చెబుదామనుకుని తటపటాయిస్తున్నాను వీర్రాజు విషయంలో నువ్వు చాలా జాగ్రత్తగా ఉండాలి. నేను లేనప్పుడెప్పుడైనా ఇంటికి వస్తే మొహమాటపడి మర్యాద చేయకు, గుమ్మంలోంచే బయటకు పంపేసెయ్" అన్నాను మళ్ళీ.

శ్రీమతి తలవంచుకుని- "ఆ సంగతి మీరు చెప్పనవసరంలేదు. నాకు తెలుసు" అంది.

ఉలిక్కిపడి - "ఎప్పుడైనా వీర్రాజు మనింటికి వచ్చేడా ?" అన్నాను.

"ఎలా చెప్పాలా అని తటపటాయిస్తున్నాను..." అంటూ చెప్పిన కథ విన్నాక - సరిగ్గా రఘునాథ్ విషయంలోలాగే జరిగిందనుకున్నాను.

ఇన్ని జరిగాక ఏం చేయాలి - ఇల్లు మారిపోయి తీరాలా ?

కానీ వీర్రాజుకి బుద్ధిచెప్పకుండానే ?

అయితే సిగ్గూఎగ్గూలేని వీర్రాజుకు బుద్ధిచెప్పడమెలాగ ?

దవుడ ఎదా అవకాశం ఇవ్వలేదు
పోడు గదా......

## 4

ఏం చేయాలో పాలుపోవడంలేదు" అన్నాడు కైలాసరావు.

కైలాసరావు కుద్యోగమున్నప్పటికీ పేదవాడనే చెప్పాలి. అతనికున్న ఎన్నో బాధ్యతలకు — కనీసం స్వంత ఇల్లన్నా లేకపోతే చాలా ఇబ్బంది పడే వాడు. అయితే యిప్పుడా స్వంతిల్లు చేజారిపోయే ప్రమాదం వచ్చింది.

కైలాసరావు తండ్రి - వీర్రాజు తండ్రి - ఇద్దరూ స్నేహితులు. ఇద్దరివీ పక్కపక్క ఇళ్ళు.

ఇటీవల ఏదో విషయంలో వీర్రాజూ కైలాసరావూ దెబ్బలాడుకున్నారు. వీర్రాజు శాంతంవహించినకొద్దీ కైలాసరావు రెచ్చిపోయి వీర్రాజుని నానా దుర్భాషలూ ఆడాడు. రెండురోజుల లాగి వీర్రాజు కైలాసరావుకో కాగితం చూపించాడు. దానిమీద రాసిఉన్న ప్రకారం 1956వ సంవత్సరంలో కైలాసరావు తండ్రి వీర్రాజు తండ్రివద్ద అయిదు వేలరూపాయల రొఖ్ఖం అప్పుగా తీసుకున్నాడు. అందుకు ఇల్లు తాకట్టు పెట్టాడు. ఆ బాకీవిషయం కైలాసరావుకి ఏమాత్రం తెలియదు. డబ్బయినా ఇయ్యి - ఇల్లయినా వదులుకో అంటున్నాడు వీర్రాజు.

కైలాసరావు ఇల్లు వదులుకోలేదు. కూడా అనుమానించదగ్గవిగా ఉన్నాయి.

మార్కెట్లో నేను కైలాసరావుని మామూలుగా ప్రశ్నించగా అతను తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు. అంతా విన్నాక చాలా ఆశ్చర్యం కలిగింది. కైలాసరావుతండ్రి వీర్రాజుతండ్రి దగ్గర అప్పుచేశాడే అనుకుంటే అప్పుడే ఆ అప్పుతీసుకుని ఇరవై ఏళ్ళయిపోతోంది. ఇంతకాలమూ వీర్రాజేం చేస్తున్నాడు ?


వీర్రాజు సైకాలజీ అర్థమైన నాకు ఇందులో మోసముందని అర్థమైంది. కైలాసరావుని మానసికి సంఘర్షణ గురిచేసి ఆనందించడం అతని అభిప్రాయమని నాకు తోచింది ఒకసారి ఆ కాగితాన్ని పరిశీలించాలనుకున్నాను.

"విషయాన్ని పెద్దమనుషుల సమక్షంలో సెటిల్ చేద్దామని చెప్పండి — నా స్నేహితుడు రఘునాథ్‌ని కూడా పిలుస్తాను. అంతా మా ఇంట్లో సమావేశ మవుదాం మీ సమస్య కేదైనా పరిష్కారం దొరుకుతుందేమో చూద్దాం" అన్నాను.

కైలాసరావుకి పెద్దగా ఆశఉన్నట్లు లేదుకానీ అంగీకార సూచనగా తలాడించాడు

మర్నాడు అందరం మా ఇంట్లో సమావేశమయ్యాం.

వీర్రాజు ఓ కాగితాన్ని తీసి నాకు



[illegible] కింద పడతారేమోనని వారికి భయం పెన్నీ!!

Jayadev

అందించి – "ఇది కైలాసరావు తండ్రిగారు మా నాన్నగారికి రాసిచ్చినదానికి కార్బన్ కాపీ –" అన్నాడు.

అది చాలా పాతకాలపు కాగితం. రంగు చాలావరకూ పసుపుకు మారింది. ఫిబ్రవరి 1956లో రాశారు. దానిమీద వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

దవళేశ్వరం

ఫిబ్రవరి 7, 1956

మహారాజశ్రీ గుడివాడ భానుమూర్తి గారు దయతో నాకు రు 5000-00 లు (అక్షరాలా ఐదువేల రూపాయలు) అవసరానికి అప్పుగా ఇచ్చి ఆదుకున్నారు. ఈ అప్పు తీరేవరకూ రథంవీధిలో ఉన్న నా స్వగృహం వారికి తాకట్టుగా సమర్పించుకుంటున్నాను. ఇది చేబ్రోలు రామన్న అనబడే నేను స్వహస్తంతో రాసి ఇచ్చిన కాగితము.

చేబ్రోలు రామన్న

"ఇంతకాల ఏం చేస్తున్నారు!" అన్నాను నేను వీర్రాజుని ప్రశ్నార్థకంగా చూసి. రఘునాథ్ ఆ కాగితాన్ని పరిశీలనగా చూస్తున్నాడు.

"ఈ సంగతి నాకు తెలియదు. ఏవో పాత కాగితాలు తిరిగేస్తుంటే ఇది దొరికింది. మా నాన్నగారు నాతో అంటూండేవారు రామన్నగారికి తను ఇల్లు తాకట్టుమీద అప్పుఇచ్చానని. కానీ ఆయన అనుకోకుండా చనిపోవడంతో కాగితాలేవీ నాకు అప్పగించలేకపోయారు..."

"మీ తండ్రిగారు పోయి ఎంతకాలమైంది?"

"పదిహేను సంవత్సరాలకు పైగా"

"ఈ కాగితం అప్పు వసూలుకుగాను మీరు తెచ్చిన నకలు అని వెనకాల రాసి సంతకం పెట్టండి. మీ బాకీ డబ్బు మీకు చేరేలా నేను చేస్తాను" అన్నాను.

వీరాజు ఆశ్చర్యంగా నావంక చూశాడు

నేను నా జేబులోనుంచి చెక్కుబుక్కు తీశాను - "రిఫ్రిజిరేటర్ కొందామని అనుకుంటున్నాను. కైలాసరావుగారిని ఆదుకోవడం కోసం నా అవసరాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకోగలను. కాబట్టి మీ రా కాగితం ఇస్తే చెక్కు రాసిస్తాను. చెక్కు మారినాకనే రసీదు ఇద్దురుగాని..."

రఘునాధ్‌నుంచి కాగితం వీరాజు దగ్గరకు వెళ్ళింది. వీరాజు కాగితం వెనకాల విషయం రాసి సంతకంపెట్టి నా కందించాడు.

కాగితం అందుకుని "కాబట్టి వీరాజు గారూ - మీకూ కైలాసరావుగారికీ ఏమీ బాకీ లేదు. మీరిక వెళ్ళొచ్చు... ..." అన్నాను.

"అది నకలు కాపీ. అసలుకాపీ వేరే నా దగ్గర ఉన్నది..." అన్నాడు వీరాజు చిరాగ్గా.

"అది కాదండీ-మీకు రాసినకాగితం మోసమంటాను. మీరు కైలాసరావుని మోసం చేయడానికి ప్రయత్నించారంటాను. అది ఋజువుచేయడానికి అవసరమైతే కోర్టుదాకా వెడతాను. ఇప్పుడు మీరిచ్చిన కాగితం చాలు మోసగాడుగా నిరూపించడానికి..." అన్నాను తీవ్రంగా.

వీరాజు ముఖంలో కోపం, మిగతా వాళ్ళముఖంలో ఆశ్చర్యం కనబడ్డాయి.

"సరే ! అలాగే చేయండి. అలాగే కోర్టులో కలుసుకుందాం" అంటూ లేచాడు.

"ఆగండి. ఒక్క నిముషం కూర్చుని నేను చెప్పేది విని వెళ్ళండి. ఈ కాగితం 1956లో వ్రాశారంటున్నారు. అప్పుడు రాసి ఉంటే అయిదు వేల రూపాయలు అంకెల్లో వేసినప్పుడు 5000-0-0 అని వ్రాసి ఉండాలి. ఎందుకంటే అప్పటికింకా నయాపైసలు రాలేదు. లెక్కలన్నీ రూపాయి అణా పైసల్లో వేసేవారు. తరువాత సంవత్సరంలో నయాపైసలు వచ్చాయి. అన్నీ తెలివిగా చేసే మీరు ఒక్క విషయం విస్మరించారు. కాగితం పాతదేకానీ అంకె పాతది కాదు. మీ ఆటలు కట్టించడానికి ఇంక ఈ కాగితం ఎప్పుడూ నా దగ్గరే ఉంటుంది -" అన్నాను.

లేచిన వీరాజు కూర్చుండిపోయాడు. అప్పుడింకేం జరిగిందో చెప్పడానికి బదులు తర్వాతేం జరిగిందో చెబితే చాలు

వీరాజు నా పాతికరూపాయల బాకీ తీర్చేశాడు. మా ఆవిడిచ్చిన కప్పు కాఫీపొడి వెనక్కు వచ్చేసింది. మా పిల్లల బోటు వాళ్ళకు తిరిగివచ్చేసింది.

మేము ఇల్లు మారలేదు కానీ వీరాజు తనిల్లు అద్దెకిచ్చేసి ఊరుమారిపోయాడు. ఎందుకంటే ఇప్పుడు అతనికి ఎదురింటి ప్రమాదం వచ్చింది.

———